సాక్షి అనకాపల్లి

బుధవారం, 17, మే, 2023



గాలివాన బీభత్సం 8లో

కె.కోటపాడు మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సాన్ని సృష్టించింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.



వైఎస్సార్ సీపీలో చేరిక 8లో

చీడికాడ మండలంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో టీడీపీ నుంచి 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

స్వల్ప వర్షసూచన

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజుల్లో రెండు రోజులు వర్ష సూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 18న 8 మి.మీ, 19న 5 మి.మీ. వర్షపాతం నమోదవుతుందని తెలిపారు.

న్యూస్‌రీల్

మోదకొండమ్మ పాదాలకు జలాభిషేకం



పసుపు నీటితో మోదకొండమ్మ పాదాలను అభిషేకిస్తున్న మహిళలు

మాడుగుల: సతకంపట్టు వద్ద ఉన్న మాడుగుల మోదకొండమ్మ పాదాలకు మహిళలు మంగళవారం జలాభిషేకం చేశారు. పసుపు నీటిని కుండలతో అమ్మవారి పాదాలపై పోసి సుమారు రెండు వేలమంది అభిషేకాలు నిర్వహించారు. సతకంపట్టు వద్ద కొలువు దీరిన అమ్మవారికి ప్రతి ఏటా గ్రామంలోని మహిళలు జలాభిషేకం చేసి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన

- సబ్బవరం మండలంలో జగనన్న కాలనీ, నాడు–నేడు పనుల సమీక్ష



బోధివలసలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సబ్బవరం: మండలంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మంగళవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. బోదువలస గ్రామంలోని జగనన్న కాలనీని, గుల్లేపల్లి గ్రామంలోని నాడు–నేడు పథకంలో చేపడుతున్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను పరిశీలించారు. అదే విధంగా సబ్బవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోర్టు వివాదంలో ఉన్న జగనన్న కాలనీల ఇళ్ల స్థలాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, గృహ నిర్మాణ అధికారులకు సూచించారు. సబ్బవరంలోని పీహెచ్‌సీ సమస్యలు అధ్యయనం చేసేందుకు డీఎంహెచ్‌వోను పంపిస్తామని తెలిపారు. సిబ్బంది సమయపాలనపై ఆరా తీశారు. మండలంలో చేపడుతున్న సమగ్ర రీసర్వే పురోగతిని తహసీల్దార్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ భోకం సూర్యకుమారి, ఎంపీడీవో రమేష్‌నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, పీవోపీఆర్డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై గట్టి నిఘా పెంచండి : జిల్లా ఎస్పీ



అనకాపల్లి రూరల్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్ : గ్రామీణ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మంగళవారం సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయంలో గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. వేసవి దృష్టిలో పెట్టుకొని చోరీలకు తావివ్వకుండా నిఘా పెంచాలన్నారు. పక్కనే ఉన్న డీఎస్పీ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలించారు. జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపివేసిన వాహనాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, డీఎస్పీ సుబ్బరాజు, సీఐ రవికుమార్, ఎస్‌ఐ సీహెచ్.నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి టౌన్: జగనన్న విదేశీ విద్యాదీవెనకు అర్హులైన విద్యార్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, కాపు విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉండాలి. వీరికి పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ చదివేందుకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. అంతర్జాతీయంగా టాప్ 50 విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే వెసులుబాటు ఉంది. క్వాలిఫైయింగ్ కోర్సులో 60 శాతం మార్కులు, తత్సమాన గ్రేడ్ ఉన్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. ఎంబీబీఎస్ కోర్సులో చేరాలనుకొనే ఇంటర్మీడియేట్ విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత సాధించాల్సి వుంటుంది. అర్హులైన విద్యార్థులు https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది.

విలవిల

- వడగాడ్పులతో 'ఉక్క'రిబిక్కిరి
- జిల్లాలో పలుచోట్ల 44 డిగ్రీల ఉష్ణోగ్రత
- అర్ధరాత్రి వేళ 32 డిగ్రీలకు పైనే నమోదు
- ఉదయం 10 గంటలకే ప్రధాన రహదారులు ఖాళీ
- నేడూ ఇదే పరిస్థితి.. ఆపై కాస్త ఉపశమనం



నిర్మానుష్యంగా మారిన అనకాపల్లి పట్టణ ప్రధాన రహదారి

అనకాపల్లి టౌన్/చోడవరం: రెండు రోజులుగా భానుడు భగభగమండిపోతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటలవుతున్నా ఎండ వేడిమి తగ్గట్లేదు. ఇళ్ల నుంచి బయటకి రావాలంటే ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. 10 గంటలు దాటితే రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అటు సూర్యతాపం ఇటు తీవ్రమైన ఉక్కపోతతో జిల్లాలో వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. మంగళవారం జిల్లాలో పలుచోట్ల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బలిఘట్టం, మాడుగుల, రోలుగుంట, రావికమతంలో ఉష్ణోగ్రత 44 డిగ్రీలు దాటింది. అనేక చోట్ల 40 డిగ్రీలు దాటే నమోదైంది. అర్ధరాత్రి వేళ కూడా వేడిమి 32 డిగ్రీలు దాటుతోంది. ఎండ తీవ్రతతో జనం అల్లాడిపోతున్నారు. ఇళ్లల్లో పంకాలు తిరుగుతున్నా ఉక్కపోతను తట్టుకోలేకపోతున్నారు. రెక్కాడితే గాని డొక్కడాని రిక్షా డ్రైవర్లు, రోజు కూలీలు ఉష్ణోగ్రతలను తట్టుకోలేక రోజువారీ కూలి పనులకు దూరమవుతున్నారు. పొరుగూళ్లకు ప్రయాణమవ్వాలనుకునే వారు ఉష్ణతాపం ధాటికి ప్రయాణాలకు స్వస్తి చెప్పి, ఇళ్లకే పరిమితమవుతున్నారు. శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో యువత శీతలపానీయాలు, తాటిముంజల కొనుగోళ్లతో కాసింత ఊరట చెందుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ వాడకం ఎక్కువవుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవకుండా, ఒకవేళ అయినా తక్షణ మరమ్మతులకు సిద్ధంగా ఉన్నారు. డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఎక్కువగా ద్రవపదార్థాలను తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు. చోడవరం, మాడుగుల, బుచ్చెయ్యపేట, రావికమతం, కె.కోటపాడు, అనకాపల్లి మండలాల్లో ఉన్న క్వారీలో అనేక మంది కార్మికులు, కూలీలు ఈ వడదెబ్బకు బెంబేలెత్తిపోతున్నారు. చోడవరం నియోజకవర్గంలో ఇప్పటికే పలు గ్రామాల్లో కూలీలు, వృద్ధులు వడదెబ్బకు, ఉష్ణతాపానికి గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఎండల్లో పనిచేస్తున్న కూలీలు, ఉపాధి కూలీల కోసం మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. బుధవారం కూడా ఇదే ఎండల తీవ్రత ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఆ తర్వాత కాస్త చల్లబడవచ్చు.



గొడుగుపై ఆకులతో ఎండ వేడి నుంచి రక్షణ

జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా.. (డిగ్రీల్లో)

మండలం	గ్రామం	ఉష్ణోగ్రత
నర్సీపట్నం	బలిఘట్టం	44.55
మాడుగుల	మాడుగుల	44.49
రోలుగుంట	రోలుగుంట	44.19
రావికమతం	రావికమతం	44.06
బుచ్చెయ్యపేట	వడ్డాది	43.71
చీడికాడ	చీడికాడ	42.0
చోడవరం	చోడవరం	41.12

మత్స్యకారులకు అండగా..



కలెక్టరేట్‌లో మత్స్యకారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- జిల్లాలో 11,373 మందికి మత్స్యకార భరోసా
- రూ.11.37 కోట్ల చెక్కు అందజేసిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ మత్స్యకార భరోసా మొత్తాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గంగపుత్రుల బ్యాంకు ఖాతాల్లో బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. వేట నిషేధం అమలులో ప్రభావితమైన కుటుంబాలకు 2023–24 ఏడాదికి సంబంధించిన 5వ విడత వైఎస్సార్ మత్స్యకార భరోసా ఆర్థిక సహాయాన్ని ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు వంతున అందజేస్తున్నారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్, అధికారులు, మత్స్యకార నాయకులు, లబ్ధిదారులు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో మొత్తం 11,373 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.11 కోట్ల 37 లక్షల 30 వేలు నేరుగా జమ చేస్తున్నట్టు చెప్పారు. పరవాడ మండలంలో 868 మందికి రూ.86.80 లక్షలు, అచ్యుతాపురంలో 1825 మందికి రూ.1.82 కోట్లు, రాంబిల్లిలో 1306 మందికి రూ.1.30 కోట్లు, ఎస్.రాయవరంలో 2478 మందికి రూ.2.47 కోట్లు, నక్కపల్లిలో 1883 మందికి 1.88 కోట్లు, పాయకరావుపేట మండలంలో 3013 మందికి రూ.3.01 కోట్ల లబ్ధి చేకూరుతోందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి లక్ష్మణరావు, మత్స్యకార సిబ్బంది, మత్స్యకార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్య భద్రతకు ఎస్ఎన్‌సీయూ 8లో

కృషీవలుడికి సముచిత స్థానం

- ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్‌గా వీసం రామకృష్ణ
- ఇప్పటికే కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా సేవలు
- తాజా నియామకంతో సర్వత్రా హర్షం



నక్కపల్లి: కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరిస్తున్న వీసం రామకృష్ణను మరో పదవి వరించింది. కీలకమైన ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీయూఎఫ్ఐడీసీ) డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం కార్యాలయం నుంచి కూడా వీసం రామకృష్ణకు సమాచారం అందడంతో ఆయన అభిమానుల్లో ఆనందం పరవళ్లు తొక్కింది. పలు పదవులను, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినందుకు గుర్తింపుగా దక్కిన సముచిత స్థానమని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దివంగత మహానేత వైఎస్సార్ అనుచరుడిగా గుర్తింపు పొందిన వీసం రామకృష్ణ.. పీఏసీఎస్ అధ్యక్షుడిగా, డీసీసీ ప్రధాన కార్యదర్శిగా, పీసీసీ సభ్యుడిగా వ్యవహరించారు. వైఎస్సార్ మరణానంతరం కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో, 2021 స్థానిక ఎన్నికల్లో కీలక పాత్ర పోషించి, పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేలా కృషి చేశారు. నక్కపల్లి మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులతోపాటు, 16 ఎంపీటీసీ స్థానాలు 20కి పైగా సర్పంచ్ పదవులను సైతం వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలుచుకున్నారు. పార్టీలో రామకృష్ణ పనితనాన్ని గుర్తించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా, విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా అవకాశమిచ్చారు. తాజాగా రామకృష్ణను ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్‌గా 2 సంవత్సరాలపాటు కొనసాగేలా నియమించారు. రాష్ట్రంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఏ బాధ్యతలు అప్పగించినా తు.చ తప్పకుండా నిర్వర్తిస్తానన్నారు. రాష్ట్ర డైరెక్టర్‌గా ఎంపికైన రామకృష్ణను ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, పార్టీ మండల అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, సర్పంచ్‌లు వెంకటేష్, రత్నకుమారి, సాదిరెడ్డి శ్రీను, వెదుళ్ల రమణ, కొండలరావు, సురేష్ వర్మ, భార్గవ్, చినపేర్రాజు, శంకర్రావు, మైలపల్లి శ్రీను, ఆనందరావు, రాజబాబు, ఎంపీటీసీలు అభినందనలు తెలిపారు.

ఐఐటీ/నీట్ మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి 21న పరీక్ష

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఐఐటీ/నీట్ మెడికల్ అకాడమీల్లో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 21న నిర్వహించే రెండో దశ పరీక్షకు ఎంపికైన జాబితా http://apgpcet.apcfss.in లో అందుబాటులో ఉంది. ఈ మేరకు రాష్ట్ర సంక్షేమ గురుకుల కళాశాలల విశాఖ జిల్లా సమన్వయాధికారి ఎస్. రూపవతి ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు రూ.100తో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న జరిగే ప్రవేశ పరీక్షకు విశాఖ–అనకాపల్లి జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థులు మాత్రమే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం, శ్రీకృష్ణాపురం కేంద్రానికి హాజరుకావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 0891–2799641కు సంప్రదించవచ్చు.

ప్రమోదం...ప్రభంజనం

- అమ్మ దర్శనం.. భక్తి పరవశం
- ఘనంగా ముగిసిన మోదకొండమ్మ జాతర 8లో

2047కు అభివృద్ధి చెందిన దేశంగా భారత్

- ఆ దిశగా ప్రధాని మోదీ ప్రణాళికలు
- అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ప్రయాణం
- రోజ్‌గార్ మేళాలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాద్



అభ్యర్థికి నియామక పత్రాలను అందజేస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాద్

దొండపర్తి (విశాఖ దక్షిణ): అత్యధిక యువశక్తి కలిగిన భారత్.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాలన్న సంకల్పంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నారని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కిషన్‌రావ్ కరాద్ పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు సాధించిన 388 మంది అభ్యర్థులకు మంగళవారం పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047కు దేశానికి స్వతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతుందని, అప్పటికి భారత్ ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. ఒకవైపు మాంద్యం కారణంగా అగ్రదేశాలు ప్రధానంగా అమెరికా, చైనాలు సతమతమవుతుంటే.. భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందని స్పష్టం చేశారు. ప్రధానంగా ద్రవ్యోల్బణం రేటు తక్కువగానే ఉండడం శుభపరిణామమన్నారు. పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిన కారణంగా అక్కడ నిత్యావసర ధరలు మండిపోతున్నాయని గుర్తు చేశారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా..

ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థల్లోనే కాకుండా దేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులతో ఎంఎస్ఎంఈ, ఇన్‌ఫ్రా రంగాలు గణనీయంగా పుంజుకొని విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని భగవత్ కిషన్‌రావ్ కరాద్ తెలిపారు. ప్రధానంగా మేకిన్ ఇండియా ద్వారా వైద్య, రక్షణతో పాటు అనేక రంగాల్లో దేశీయ పరిజ్ఞానంతో ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో ప్రగతి దిశగా పయనిస్తున్న దేశంలో యువతకు 10 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో రోజ్‌గార్ యోజన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా విశాఖలో 388 మందికి పోస్టల్, రైల్వే, ఎయిమ్స్, ఐఐఎం జీఎస్ఐ వంటి కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థల్లో ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వి.రాములు, కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్, ఐఐఎం అధికారులు పాల్గొన్నారు.

చదువే ఆస్తి

- నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి
- జీవీఎంసీ పాఠశాలల్లో చదివిన టెన్త్ టాపర్లకు అభినందన
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మేయర్



హన్సితకు స్వీట్ తినిపిస్తున్న మేయర్ హరివెంకట కుమారి



టాపర్ మణికంఠస్వామికి రూ.10 వేల ప్రోత్సాహక నగదుతోపాటు మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్ (విశాఖ): చదువే ఆస్తి.. చదువుతోనే బంగారు భవిష్యత్తు లభిస్తుందని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో వారిని మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు తదితరులు అభినందించారు. మంగళవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో అభినందన సభ నిర్వహించారు. 8 జోన్ల పరిధిలోని జీవీఎంసీ పాఠశాలల్లో 500 మార్కులు పైబడి సాధించిన 244 మందికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన (592, 587, 586 మార్కులు) విద్యార్థులకు మేయర్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మేయర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ జీవీఎంసీ పాఠశాలలో చదివి 592 మార్కులు సాధించడం గొప్ప విషయమన్నారు. ×మీరంతా ఫస్ట్ స్టెప్ ఎక్కారు. ఇక ఇంటర్ అనేది లైఫ్ టర్నింగ్ పాయింట్.. మీ లక్ష్యమంతా చదువుపైనే ఉండాలÇన్నారు. టైం టేబుల్ ప్రకారం హార్డ్‌వర్క్ చేస్తే లక్ష్యం సాధించవచ్చన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగ్గా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు.

మరిన్ని విజయాలతో ముందుకు సాగాలి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఇంటర్ నుంచి పునాది వేసుకుని మరిన్ని విజయాలతో ముందుకు సాగాలని సూచించారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ 2023–24 ఏడాదిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక వేస్తున్నట్టు తెలిపారు. ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ పాఠశాలల్లో చదివే పిల్లలు 500 పైబడి మార్కులు సాధించడం అమోఘమన్నారు. డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్ మాట్లాడుతూ స్కూల్స్ డ్రాప్ అవుట్స్ తగ్గించేందుకు ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు, డిప్యూటీ ఈవో శ్రీనివాస్, జీవీఎంసీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వీరంతా 500 మార్కులు పైబడిన జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులు

బాగా చదివించారు



గతంలో మౌలిక సదుపాయాలు సరిగ్గా ఉండేవి కావు. అంచలంచెలుగా మా స్కూల్ ఎదిగింది. ఉపాధ్యాయుల కృషి మరువలేనిది. ముఖ్యంగా ఉపాధ్యాయులు బాగా చదివించారు. మంచి ప్రణాళికలు రూపొందించిన మేయర్, జీవీఎంసీ కమిషనర్‌కు కృతజ్ఞతలు.

–పూడి మణికంఠ స్వామి (592 మార్కులు), జీవీఎంసీ స్కూల్, మల్కాపురం

నాడు–నేడుతో అభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలలు బాగా అభివృద్ధి చేశారు. ప్రశాంత వాతావరణం కల్పించారు. మంచి మార్కులు వచ్చేలా సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.

–డి.హన్సిత, (587 మార్కులు), జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్, అనకాపల్లి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యం. మంచి ఉద్యోగం సాధించిన తరువాత పాఠశాలకు సాయం చేస్తా.. ముఖ్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.

–డి.లలిత్‌సాయి (586 మార్కులు), జీవీఎంసీ ప్రకాశరావుపేట హైస్కూల్

24 గంటల్లో కొత్త కనెక్షన్

- జగనన్న కాలనీల్లో సకాలంలో విద్యుత్ సరఫరాకు చర్యలు
- విద్యుత్‌శాఖ ఈఈ సురేష్‌బాబు



బుచ్చెయ్యపేట : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీల్లో విద్యుత్ సమస్యలు లేకుండా సకాలంలో పరిష్కరిస్తున్నామని నర్సీపట్నం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) ఎస్.సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం బుచ్చెయ్యపేట వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న నర్సీపట్నం, చోడవరం, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ, కోటపాడు, దేవరాపల్లి, నర్సీపట్నం, మాకవరపాలెం తదితర 14 మండలాల్లో 450 జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇంటి నిర్మాణదారులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసికున్నామన్నారు. ఇప్పటికే 247 జగనన్న లే అవుట్లలో విద్యుత్ సరఫరా చేయగా 75 లే అవుట్లలో పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. విద్యుత్ మీటరు కోసం దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే విద్యుత్ కనెక్షన్ అందిస్తున్నామన్నారు. వేసవి కాలంలో కూడా విద్యుత్ కోతలు లేకుండా వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ను సకాలంలో అందించడమే కాక పగటిపూట 9 గంటలు నిరంతర విద్యుత్ అందిస్తున్నామన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులకు వినియోగదారులు డిజిటల్ చెల్లింపులు అలవాటు చేసుకోవాలన్నారు. ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ యాప్‌ను ఓపెన్ చేసుకుంటే ప్రతి నెలా ఎంత బిల్లు చెల్లిస్తున్నదీ తెలియడమే కాక సకాలంలో విద్యుత్ బిల్లు చెల్లించడం వల్ల అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసి పరిష్కారం పొందాలన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి

అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ నక్కా పూసిబాబు(47) చికిత్స పొందుతూ మృతి చెందారు. ట్రాఫిక్ సీఐ టి.శ్రీను అందించిన వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కొవ్వూరు నుంచి ఇచ్ఛాపురం వెళ్తుండగా మంగళవారం తెల్లవారుజామున స్థానిక జాతీయ రహదారి శారదానది బ్రిడ్జిపై ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. అతనిని హుటాహుటిన పట్టణ ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి చెందారు. ఈ మేరకు మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రూ.3.50 లక్షల ఆస్తినష్టం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి టౌన్: మండలంలోని కోడూరులో ఆయుర్వేద ఆస్పత్రిలో మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. రూ.3.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. ఇక్కడ ఆస్పత్రిలో వైద్యుడు రాజ్ పెరుమాళ్ యోగా నిర్వహణకు రెల్లిగడ్డితో పాక వేశారు. షార్ట్‌సర్క్యూట్‌తో దీనికి మంటలంటుకున్నాయి. దాంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వాటిని అదుపు చేశారు.

ప్రమోదం...ప్రభంజనం

హృదయ పీఠమే అమ్మకు సింహాసనమైంది... నామ స్మరణే మంత్రోచ్చరణగా ప్రతిధ్వనించింది.. దివ్య మంగళరూపిణి దర్శనంతో జాలువారిన ఆనందబాష్పాలు పాద్యంగా మారాయి... ఉచ్ఛ్వాసనిశ్వాసాలే వింజామరలయ్యాయి.. తమ భక్తిప్రపత్తులనే నివేదన చేశారు.. మనసులోనే షోడశోపచారాలు సమర్పించి, ఉత్సవాల వేళ మోదమ్మను దర్శించుకున్న భక్తులు తన్మయంతో అలౌకికానందానికి గురయ్యారు. ప్రభంజనంలా తరలివచ్చిన ప్రజలు తల్లి దివ్యరూపాన్ని చూసి పరవశించిపోయారు. మోదమ్మను తమ గుండెల్లో కొలువుదీర్చుకున్నారు.

- అమ్మ దర్శనం.. భక్తి పరవశం
- ఘనంగా ముగిసిన మోదకొండమ్మ జాతర
- మోదమ్మ నామ స్మరణతో హోరెత్తిన పాడేరు


మోదమ్మ ఘటాల ఊరేగింపులో భారీగా పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్లో) మోదకొండమ్మ

సాక్షి,పాడేరు : జిల్లా కేంద్రం పాడేరులో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన ఉత్తరాంధ్రతో పాటు గిరిజన ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం మోదకొండ ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాలకు ప్రభుత్వం తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోటి మంజూరు చేశారు. ఈనెల 14వతేదీ ఆదివారం ఉత్సవాలు ప్రారంభమై మంగళవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు రోజు పాడేరుకు భక్తులు పోటెత్తారు.తిరుమల తిరుపతి దేవస్థానం తరపున మోదమ్మకు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పట్టువస్త్రాలను పంపారు. వీటిని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర,ఆమె భర్త మూర్తి, ఆలయ కమిటీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు ఎమ్మెల్యే దంపతులు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర,ముత్యాలమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు,రమాదేవి దంపతులు మోదకొండమ్మతల్లికి కుంకుమార్చన చేశారు. పలు ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఘటాలను శిరసున పెట్టుకుని భక్తిశ్రద్ధలతో ఆలయం వరకు మోసి మోదమ్మకు సమర్పించుకున్నారు. మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద కొలువుదీరిన మోదమ్మ ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇత్తడి ఘటాలను దర్శించుకుని పూజలు చేశారు.

అంబరాన్ని తాకిన అనుపోత్సవం

మోదకొండమ్మతల్లి జాతర ముగింపు ఉత్సవాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు,ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర.పాడేరు సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణిలు సతకంపట్టులో కొలువుదీర్చిన మోదమ్మ పాదాలు,ఉత్సవ విగ్రహం,ఇతర ఘటాలకు పూజలు చేసిన అనంతరం వాటిని శిరసున పెట్టుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు నుంచి సుంద్రుపుట్టు,పాతబస్టాండు మీదుగా అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఎస్పీ తుహిన్ సిన్హా నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించడంతో భక్తులందరికీ అమ్మవారి ఉత్సవ విగ్రహం,పాదాలను మోసే భాగ్యం కలిగింది. ఎక్కడ తొక్కిసలాటలు లేకుండా పోలీసులు రోప్‌ను ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ముగింపు ఉత్సవంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక,కళాప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలు ప్రాంతాలకు చెందిన తీన్‌మార్,కేరళ డప్పు వాయిద్యాలు, శక్తి, నేలవేషాలు, థింసా, గిరిజన నృత్యాలు, కోలాటాలు ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.ఒడిశా నుంచి వచ్చిన గిరిజన కళాకారులు ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కట్టప్ప వేషధారణలో ఉన్న గిరిజన కళాకారుడిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపడంతో పాటు, సెల్ఫీలు తీసుకున్నారు. ఊరేగింపు సంబరాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి భక్తులంతా భారీగా తరలివచ్చారు. కిలోమీటరు పొడవున సాగిన ఊరేగింపు సంబరం అంబరాన్ని తాకింది. జై మోదమ్మ నినాదాలతో పాడేరు పట్టణం హోరెత్తింది. రాత్రి వరకు ఊరేగింపు సంబరం కొనసాగింది.

వైఎస్సార్‌సీపీలో 70 కుటుంబాల చేరిక


పార్టీలోకి చేరిన వారితో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- సాదరంగా ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: మండలంలో ఖండివరం గ్రామానికి చెందిన 70 కుటుంబాలు విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరం రెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అండగా ఉంటానని భరోసా కల్పించారు. పార్టీకి కట్టుబడి పని చేసిన వారికి రానున్న కాలంలో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రామానికి చెందిన టీడీపీ వార్డు మెంబర్లు వై.అమ్మతల్లీనాయుడు, వేచలపు గంగునాయుడు, పప్పల కళ్యాణం కుటుంబాలు, జోగమ్మతోట కళ్లాలకు చెందిన పది కుటుంబాలు, వీరసారం కళ్లాలకు చెందిన 9 కుటుంబాలు, యదుగుల బుచ్చమ్మపాలెం కళ్లాలకు చెందిన 25 కుటుంబాలు, చవుటి గురువు కళ్లాలకు చెందిన 9 కుటుంబాలు, పెద్దపాలం కళ్లాలకు చెందిన 8 కుటుంబాలు, శీరం రెడ్డి వారి కళ్లాలకు చెందిన 6 కుటుంబాలు పార్టీలోకి చేరాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఆయా కుటుంబాల వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మోసూరి సన్నిబాబు, షేక్ సూర్యనారాయణ, మండల నాయకులు కురచా సత్యనారాయణ, లాలం జానకీరాం, ఎంపీపీ కురచా జయమ్మ, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


మృతుడు మహేష్ (ఫైల్)

మునగపాక : మండలంలోని మెలిపాకకు చెందిన యువకుడు మంగళవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మెలిపాకకు చెందిన ప్రగడ రమణ వ్యవసాయం సాగు చేస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. ఆయనకు ఒక్కగానొక్క కుమారుడు మహేష్ (27)తండ్రికి వ్యవసాయంలో సాయం అందిస్తూ ట్రాక్టర్ నడుపుతూ కుటుంబానికి చేయూతగా నిలుస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటిలో నిద్రించే క్రమంలో ఫ్యాన్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో మహేష్ కుటుంబం తీరని షాక్‌కు గురైంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడని ఆశిస్తున్న తరుణంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. అందరితో మంచిగా మెలిగే మహేష్ మృతితో మెలిపాకలో విషాదం అలముకుంది. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

విద్యుత్ వైర్లు తగిలి ఉపాధి కూలీ మృతి


మృతి చెందిన కన్నబాబు

మాకవరపాలెం: విద్యుత్ వైర్లు తగిలి ఉపాధి కూలీ మృతి చెందాడు. మండలంలోని బూరుగుపాలెం గ్రామానికి చెందిన కొమ్మనాపల్లి కన్నబాబు (51) నిత్యం ఉపాధి పనులకు వెళుతున్నాడు. మంగళవారం ఉదయం సమీపంలో ఉన్న కంసాలి చెరువులో పూడిక పనులకు వెళ్లాడు. పది గంటల ప్రాంతంలో పనులు చేస్తుండగా గట్టుపై ఉన్న విద్యుత్ వైర్లు గునపానికి తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఇతడిని మాకవరపాలెం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడకు వెళ్లేసరికి మృతి చెందాడని భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

ఉరేసుకుని హరిదాసు ఆత్మహత్య


వేణుగోపాలకృష్ణ మృతదేహం

మాకవరపాలెం: మండలంలోని తామరం గ్రామానికి చెందిన మైచర్ల వేణుగోపాలకృష్ణ(35) ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడు హరిదాసు వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలానే సోమవారం రాత్రి ఇంట్లో నిద్రించిన తను మంగళవారం ఎంతకీ బయటకు రాలేదు. ఈ క్రమంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గత కొన్ని రోజులు భార్యా పిల్లలు మృతుడి అత్తగారింట్లో ఉంటున్నారని వారు తెలిపారు. మృతదేహాన్ని ఎస్ఐ రామకృష్ణారావు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

- రెండు ట్రాక్టర్లకు రూ.8,895 జరిమానా


పట్టుబడిన ట్రాక్టర్లు

రోలుగుంట: మండలంలోని కంచుగుమల రెవెన్యూ పరిధి జిరాయితీ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేసి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఇన్‌చార్జి తహసీల్దార్ హెచ్.త్రివేణి పట్టుకున్నారు. మంగళవారం కొత్తకోట-రోలుగుంట ఆర్‌అండ్‌బీ మార్గంలో పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. దాంతో భూ యజమానులు ఆమెను కలసి తమ భూములను చదును చేసుకుంటున్నామని విన్నవించుకున్నారు. అయినప్పటికీ మైనింగ్ అధికారుల అనుమతి ఉండాలని, ఇలా చేయడం తగదని తహసీల్దారు చెప్పి రూ.8,895 జరిమానా విధించి ట్రాక్టర్లను విడుదల చేశారు. ఆర్ఐ రామ్మూర్తి, వీఆర్వో లక్ష్మణ్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం


మర్రివలసలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న యువకులు

కె.కోటపాడు: మండలంలో మంగళవారం సాయంత్రం మర్రివలస, గొట్లాం, శృంగవరం గ్రామాల్లో గాలివాన బీభత్సాన్ని సృష్టించింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు సాయంత్రం గాలివానతో మరింత హడలెత్తిపోయారు. చిరుజల్లుల తోపాటు పెద్ద ఎత్తున ఈ మూడు గ్రామాల్లో గాలి వీయడంతో మర్రివలస గ్రామానికి వచ్చే మార్గంలో రోడ్లపైనే చెట్లు విరిగిపడ్డాయి. గొట్లాం, మర్రివలస, శృంగవరం గ్రామాల్లో పలుచోట్ల 15 విద్యుత్ స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్టు ఈ గ్రామాల ప్రజాప్రతినిధులు తెలిపారు. మామిడి పంట ప్రస్తుతం కోతదశకు చేరుకున్న సమయంలో పంటకు తీవ్ర నష్టం కలిగించినట్లు రైతులు తెలుపుతున్నారు. మామిడి పండ్లు నేలకు రాలినట్లు రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

లక్ష మందికి బీమా సౌకర్యం కల్పించడమే లక్ష్యం

- ఎస్‌బీఐ రీజనల్ ఫైనాన్స్ మేనేజరు సత్యనారాయణ


ఉపాధి హామీ కూలీలకు బీమా పత్రాలు ఇస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నాతవరం : ఈ ఏడాది జిల్లాలో భారతీయ స్టేట్ బ్యాంకు ద్వారా లక్ష మందికి ప్రమాద బీమా సౌకర్యం కలిపించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా ఎస్‌బీఐ రీజనల్ ఫైనాన్స్ మేనేజరు సత్యనారాయణ అన్నారు. మండలంలో ఎం.బి.పట్నం గ్రామంలో మంగళవారం సర్పంచ్ కాళ్ల ఝాన్సీరాణి అధ్యక్షతన ఎస్‌బీఐ ఇన్సురెన్సుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి సురక్ష బీమా యోజన పథకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సురక్ష బీమా యోజన కింద కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2లక్షలు వరకు ప్రమాద బీమా కుటుంబానికి వస్తుందన్నారు. అంగవైకల్యం బీమా కూడా వర్తిస్తుందన్నారు. స్టేట్ బ్యాంకులో ఖాతా కలిగి ఉండి 18 నుంచి 70 ఏళ్ల లోపు వయస్సు గలవారు అర్హులన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షలు జీవిత బీమా సౌకర్యం ఉంటుందన్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు వరకు బ్యాంకు ఖాతా కలిగి ఉన్న అందరూ అర్హులేన్నారు. బీమా సొమ్ము బ్యాంకు ఖాతా నుంచే చెల్లించాలన్నారు. ప్రధానంగా కుటుంబ యాజమాని ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకూడదన్న భావనతో ప్రభుత్వం ఈ బీమా సౌకర్యం కల్పించిందన్నారు. జిల్లాలో ఎస్‌బీఐలో ఖాతా ఉన్న ప్రతి వ్యక్తికి బీమా కల్పించడమే ధ్యేయమన్నారు. గతంలో బీమా సౌకర్యం పొందిన లబ్ధిదారులు 3 లక్షలకు పైగా ఎస్‌బీఐలో ఉన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 24 మండలాల్లో మా బ్రాంచి మేనేజర్లతో కలిసి ఎంపీడీవోలు ఉపాధి హామీ పథకం ఏపీవోలు ఆధ్వర్యంలో కూలీలకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతి ఉపాధి హామీ కూలీలకు బీమా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

నాతవరం మండలంలో యరకంపేట ఎం.బి.పట్నం గ్రామాల్లో 2వేలకు పైగా ఉపాధి హామీ పథకం కూలీలకు బీమా సౌకర్యం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తాండవ జంక్షన్ స్టేట్ బ్యాంకు మేనేజరు చైతన్యకుమార్, సీఎస్‌పీ బ్యాంకు జిల్లా ఇంఛార్జి జగదీష్, ఏపీవో చిన్నారావు, సర్పంచ్ కాళ్ల ఝాన్సీరాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీను గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్య భద్రతకు ఎస్ఎన్‌సీయూ

- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్


ఎస్ఎన్‌సీయూ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎన్‌సీయూ(స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్), బ్లడ్‌బ్యాంక్‌ను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్యానికి భద్రత కల్పించడమే ఎస్ఎన్‌సీయూ ముఖ్యోద్దేశమన్నారు. చిన్నారులకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు పది పడకలతో కూడిన ఎస్ఎన్‌సీయూను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వారికి అవసరమైన వార్మర్లు, ఫొటోథెరఫీ సేవలకు బయటకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి బ్లడ్ బ్యాంక్ దోహదపడుతుందన్నారు. మూడు అంతస్తులతో కూడిన ఓపీ నూతన భవనాన్ని జూన్‌లో ప్రారంభిస్తామన్నారు. రూ.15 కోట్లతో ఆస్పత్రిలో అధునాతన వైద్య సైవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మైదాన, గిరిజన ప్రాంతాలకు పెద్దదిక్కుగా ఉన్న నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో ప్రతి నెలా 400కు పైగా ప్రసవాలు నమోదుతో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ తమరాన అప్పలనాయుడు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, టౌన్, పార్టీ మండలాధ్యక్షుడు ఏకా శివ, సుర్ల సత్యనారాయణ, డీసీహెచ్ఎస్ శ్రావణ్ కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి దేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

2024లో ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా?

- అయ్యన్నపాత్రుడికి నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ సవాల్

నర్సీపట్నం: టీడీపీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికి మతిభ్రమించిందని, మద్యం మత్తులో ఏమి మాట్లాడుతున్నాడో తెలియని పరిస్థితిలో ఉన్నాడని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. మంగళవారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టీడీపీ ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా? అని అయ్యన్నపాత్రుడిని సవాల్ విసిరారు. 175 నియోజకవర్గాల్లో పోటీ చేసే దమ్మున్న ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అధికారంలోకి వచ్చేస్తామన్న భ్రమలో అధికారులను బెదిరించడం తగదన్నారు. టీడీపీ నాయకులను మరోసారి తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా చేస్తామని అయ్యన్నపాత్రుడు ప్రకటించటం సిగ్గుచేటన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వారు వీటి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. మరో ముప్పై ఏళ్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగటం ఖాయమన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ తమరాన అప్పలనాయుడు, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, రూరల్ పార్టీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

20న ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్

కంచరపాలెం: ప్రభుత్వ పాత ఐటీఐలో సెనాజియల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ విశాఖ శాఖలో పనిచేసేందుకు ఐటీఐ, డిప్లమో కోర్స్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ నెల 20న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, ఎంఎంటీఎం, వెల్డర్, డీజిల్ మెకానిక్, ఎంఎంవీ, డిప్లొమో మెకానికల్, మెటలార్జి కోర్స్‌ల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు వారి ధ్రువ పత్రాలతో 20వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866088240 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

20న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల్లో 2034-24 సంవత్సరానికిగాను ప్రవేశానికి ఈనెల 20 తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందని జిల్లా కో ఆర్డినేటర్, గురుకుల ప్రిన్సిపాల్ కోడి రాంబాబు మంగళవారం తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు పరీక్ష జరుగుతుందని, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జూనియర్, డిగ్రీ కళాశాల్లో ప్రవేశానికి పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యేవారు హాల్ టికెట్లను htpps//aprs.apcfss.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని కోరారు.

17 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

ఎస్.రాయవరం : నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు మంగళవారం తెలిపారు. రోలుగుంట మండలం బెన్నభూపాలపట్నం గ్రామానికి చెందిన పాకల పరశురామ్ , మట్టిపాటి గణేష్ స్కూటీపై 17 కేజీల గంజాయి తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి గంజాయి, స్కూటీ, రూ 21,500, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడ్డ వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు.

పలు రైళ్లు రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్లకు పలు రైళ్లు ఆలస్యంగా చేరుకుంటున్న నేపథ్యంలో.. పలు స్టేషన్లలో బయలుదేరుతున్న రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఆయా స్టేషన్లలో బయలుదేరిన సమయాన్ని బట్టి ఈ రైళ్లు అంతే ఆలస్యంగా స్టేషన్లకు చేరుకోనున్నాయి.

- ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 1.15 గంటల ఆలస్యంగా బెంగళూరులో మధ్యాహ్నం 11.50 గంటలకు బయలుదేరింది.
- హౌరా-ఎం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(22887) హంసఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.40 గంటలకు హౌరాలో బయలుదేరింది.
- విశాఖపట్నం-కోర్బా(18518) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 2.25 గంటలు ఆలస్యంగా రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరింది.

విద్యుత్‌షాక్‌కు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


కరెంట్ షాక్ గురైన శ్రీను జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న దృశ్యం (ఫైల్)

రాజవొమ్మంగి : మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామంలో శ్రీను (30) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురి కాగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. జడ్డంగి ఎస్ఐ షరీఫ్ కథనం మేరకు చింతపల్లి మండలం తోటరాజబంధ గ్రామానికి చెందిన శ్రీను ఇటీవలే చిన్నయ్యపాలెంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శ్రీనుకు కరెంటు పనులపై కాస్త అవగాహన వుండడంతో ఆ ఇంటికి సరఫరా లేదని తెలిసి సోమవారం ఎదురుగా వున్న కరెంట్ స్తంభం ఎక్కాడు. స్తంభానికి వున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు సరిచేస్తుండగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. తలకు బలమైన గాయమైన అతనిని కుటుంబీకులు వెంటనే జడ్డంగి పీహెచ్‌సీకు తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి అనంతరం కాకినాడ రిఫర్ చేశారు. అతను అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్లుప్తంగా

స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ



కశింకోట గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్‌పై శిక్షణ

కశింకోట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్‌పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఉపాధ్యాయుడు సూరా శ్రీనివాస్ ఆంగ్లంపై మెలకువల్ని బోధించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.వి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

• మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చెప్పడం, పాటల పోటీ, లెమన్ అండ్ స్పూన్ ఆట నిర్వహించారు. వీటిలో విజేతలైన ఎ.ప్రవీణ్ ప్రజ్ఞాన్, ఎస్.పావని లక్ష్మి, ఎం.శ్రీవైష్ణవి, కె.భవ్యశ్రీ, కె.లావణ్య, పి.జ్యోత్స్నప్రియలకు ఉపాధ్యాయుడు బి.సురేష్‌కుమార్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

చుర్రుమన్న సూరీడు



కశింకోట : మండల ప్రజలు మంగళవారం సూర్య తాపంతో విలవిలలాడారు. ఎండలు చుర్రుమనడంతో జనాలు బయటకు వెళ్లేందుకు భయపడ్డారు. అత్యధికంగా ఉష్ణోగ్రత 39 డిగ్రీల సెల్సియస్‌గా గూగుల్ సమాచారం. దీనికి తోడు వడగాడ్పులతో ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉక్కపోతతో పిల్లలు, వృద్ధులతోపాటు పెద్దలు కూడా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. బుధవారం కూడా దాదాపు ఇదే ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణ నిపుణులు చెప్తున్నారు.

విద్యార్థినుల స్వచ్ఛతా ప్రతిజ్ఞ

• ఎన్టీపీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా ప్రారంభం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 31 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా దీపాంజలి నగర్‌లో మంగళవారం ఉదయం జీజీఎంతో పాటు సంస్థ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, దీపాంజలి నగర్ వాసులు, విద్యార్థులు మార్నింగ్ వాక్ నిర్వహించారు. అనంతరం జీజీఎం సిన్హా ఉద్యోగులతో స్వచ్ఛత పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు. బాలభారతి పబ్లిక్ స్కూల్‌లో బాలికలతో సామూహిక స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 302 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,330	4,620
రెండో రకం	3,980	4,200
మూడోరకం	3,930	3,960

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	:	రాజా
రామబాణం	:	సత్యనారాయణ-1
ఫర్హానా	:	సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	:	షిర్డీసాయి
విరూపాక్ష	:	పర్తిసాయి
కథ వెనుక కథ	:	వెంకటేశ్వర
ఉగ్రం	:	శ్రీసత్య
ఏజెంట్	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 112 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, ఓ పాజిటివ్-70 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 366 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సిరిమల్లె నవ్వింది

మల్లెపూలు.. మగువలు విడదీయరాని అనుబంధం. శుభకార్యమైనా, ఎక్కడికైనా ప్రయాణమైనా కొప్పున మల్లెలు కొలువుదీరాల్సిందే. ఫంక్షన్ హాళ్లయితే.. మల్లెల మాలలతో తోరణాలు తప్పనిసరి. వివాహ కార్యక్రమాల్లో వధువు జడ నిండా మల్లెతోట విరబూయక తప్పదు. మల్లెల గుబాళింపునకు, మండు వేసవే సరైన సీజన్. ఇదే సమయంలో వివాహాది శుభకార్యాలు కూడా తోడవడంతో మల్లెపూల మారాజులైన రైతులకు సిరులపంట కురుస్తోంది.

- మండే ఎండల్లో మల్లెల గుబాళింపు
- శుభాకార్యాల వేళ మల్లెకు మంచి గిరాకీ
- కేజీ మల్లెల ధర రూ.1000–1200
- అనకాపల్లి మార్కెట్‌లో విరివిగా మల్లెలు





తుమ్మపాల : మండే ఎండల్లో మల్లెపూలు గుబాళిస్తున్నాయి. ఎండలతోపాటు, శుభాకార్యాలు కూడా ఎక్కువగా ఉండటంతో మల్లెపూలకు మంచి గిరాకీ ఏర్పడింది. ఏటా మల్లెపూల ఉత్పత్తి మార్చి నుంచి జూన్ వరకు అధికంగా ఉంటుంది. వర్షాలకు తెగుళ్ల సోకిన మల్లె తోటలు, తాజా ఎండలకు విరగబూస్తున్నాయి.

మార్కెట్‌లో మల్లెలు

గ్రామీణ వాణిజ్య పట్టణంగా పేరొందిన అనకాపల్లిలో పూల మార్కెట్‌కు రద్దీ ఎక్కువ. ఇటీవల కాలంలో ఉద్యాన పంటలతో పాటు పూల సాగు వైపు గ్రామీణ రైతులు మక్కువ చూపుతున్నారు. మల్లె, గులాబీ, కనకాంబరం, బంతి, చామంతి వంటి పూదోటల్ని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మండుతున్న ఎండలు మల్లె తోటలకు అనువైన వాతావరణం. దీంతో మల్లెపూలు అనకాపల్లి మార్కెట్‌లో విరివిగా దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు కిలో రూ.250కి కూడా దొరికిన మల్లెపూలు ప్రస్తుతం రూ.1200 వరకు ధర పలుకుతున్నాయి.

పెళ్లిళ్లతో పెరిగిన డిమాండ్

పెళ్లిళ్లు, శుభకార్యాల్లో మల్లె పూలదే అగ్రస్థానం అంటే అతిశయోక్తి కాదు. మల్లెల సువాసన వేదికల్ని ముంచెత్తుతాయి. ప్రస్తుత ధరల నేపథ్యంలో అంత భారీ దండలు వినియోగించలేని వారు కూడా.. వధువు జడను మల్లెలతో ముంచెత్తడంతోపాటు, మహిళల కొప్పుల్లో మూర మల్లెపూలైనా ఒదిగి ఉండాల్సిందే. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ జోరుగా కొనసాగుతోంది. ఈ నెల తొలి వారం నుంచి పూలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఈ నెల్లో కిలో రూ.450 నుంచి మొదలైన అమ్మకాలు రూ.1200 వరకు చేరుకున్నట్టు రైతులు ఆనందంగా చెప్తున్నారు.

సుగంధాల తయారీలో కీలకం

సుగంధాల తయారీలో కూడా మల్లెల్ని విరివిగా ఉపయోగిస్తారు. ప్రతి ఏటా మార్చి నుంచి ప్రారంభమయ్యే మల్లె తోటలు జూన్ వరకు అత్యధిక దిగుబడిని ఇస్తాయి. ఈ సీజన్‌లో మల్లెపూలను అధికంగా కొనుగోలు చేసి సౌందర్య సాధనాల తయారీకి వినియోగిస్తారు. సబ్బులు, నూనెలు, అగరొత్తులు వంటి సుగంధ ద్రవ్యాల తయారీలో ఇవి కీలకం. జుట్టు రాలడం, చుండ్రు వంటి సమస్యలకు కూడా మల్లెపూల పొడిని పలు దినుసులతో కలిపి వాడుతారు.

రోజుకో ధర

మల్లెపూల ధర స్టాక్ మార్కెట్‌ను తలపించేలా మారుతోంది. ఒక్కో రోజు ఒక్కో ధర పలుకుతోంది. శుభాకార్యాలున్న రోజుల్లో కిలో రూ.వెయ్యి నుంచి రూ.1200 మధ్య పలుకుతుంది. మిగిలిన రోజుల్లో రూ.500కు అటూఇటుగా మాత్రమే ఉంటోంది. దీంతో మల్లెపూల సాగు రైతులు, పూల వ్యాపారుల పరిస్థితి అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టి మాదిరిగా ఉంటోంది.

రోజుకో ధర మారుతుంది



మల్లెపూల ఉత్పత్తి ఈ సీజన్‌లోనే అధికంగా ఉంటుంది. గిరాకీ కూడా రోజు రోజుకూ మారుతుంటుంది. శుభకార్యాలు అధికంగా ఉన్న రోజుల్లో కేజీ మల్లెల ధర రూ.1200 పలికింది. సాధారణ రోజుల్లో రూ.250 కూడా విక్రయించాల్సి వచ్చింది. శుభ కార్యాల్లో మల్లె పూలపై మహిళలు ఎక్కువ ఆసక్తి చూపుతారు.

– తాతపూడి లక్ష్మణరావు, పూలవ్యాపారి, అనకాపల్లి

ఎండల్లోనే దిగుబడి ఎక్కువ



ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడే మల్లెల దిగుబడి అధికంగా ఉంటుంది. మొన్నటి వరకు వర్షాలు అధికంగా కురవడంతో మల్లెతోటలు పూర్తిగా తెగుళ్ల బారినపడ్డాయి. దిగుబడి విపరీతంగా తగ్గిపోయింది. పది రోజుల నుంచి ఎండలు భాగా ఉండటంతో మల్లెలు విరబూస్తున్నాయి. మొగ్గలు కోయలేనంతగా మంచి దిగుబడి వస్తుంది.

– ఎస్.రమణ, మల్లె రైతు, రేబాక గ్రామం

ఆరోగ్యవంతమైన సమాజానికి ఆయుర్వేదం

• ఈ నెల 20 నుంచి కోడూరులో ఆయుర్వేదంపై అవగాహన

అనకాపల్లిటౌన్ : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయుర్వేద వైద్యులు సుందర రాజపెరుమాళ్ల అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో ఆరోగ్య ధాత్రి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20 నుంచి ఆయుర్వేదంలో ఏడవ సప్తాహం ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఇందులో పాల్గొనే వ్యక్తులు ముందుగా రూ.వెయ్యి చెల్లించాలని, వారం రోజుల శిక్షణ అనంతరం నగదు తిరిగి ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఉత్కృష్టమైన హఠయోగ సాధనకులు, యోగాచార్యులు రామలింగ వెంకట సత్యనారాయణచే అతి ప్రాచీనమైన అష్టాంగ యోగ సాధన, ఆయుర్వేద జీవన విధానాన్ని శిక్షణలో పాల్గొన్నవారికి అందించనున్నట్టు వెల్లడించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఆయుర్వేదం ఉద్భవించిందన్నారు. ఆరోగ్యం కాపాడుకోవడానికి సులువైన సూక్ష్మమైన వ్యాయామం నుంచి అతి క్లిష్టమైన ఆసనాల వరకూ నిరంతరం సాధన చేయించనున్నట్టు పేర్కొన్నారు. సప్త ధాతువుల నుంచి ప్రతి కణం వరకు ఆమూలాగ్రం శుద్ధి చేసే షట్ క్రియల సాధన, నూతన కణముల ఉత్పాదన ద్వారా స్వాస్థ్య స్థాపనకు అత్యంత ప్రాచీన ప్రాణాయామ సాధన, బాహ్య వాతావరణంతో పాటు అంతఃశుద్ధికి నిత్యాగ్ని హోత్ర విధానంలో శిక్షణ ఉంటుందన్నారు.

చిత్రలేఖనంతో మెరుగైన భావ వ్యక్తీకరణ



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఎంఈవో దివాకర్

అనకాపల్లిటౌన్ : చిత్ర లేఖనం భావ వ్యక్తీకరణకు పదునైన మార్గమని, తద్వారా సృజనాత్మకత మెరుగుపడుతుందని మండల విద్యాశాఖాధికారి డి.దివాకర్ అన్నారు. గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో 15 రోజులుగా నిర్వహించిన ఉచిత చిత్రలేఖనం శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యదశ నుంచి చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రస్తుత కాలంలో పిల్లల చదువు, వారి భవిష్యత్‌పై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ఆటలు, నృత్యాలు, కళలపైనా ఇష్టం పెంచుకోవాలన్నారు. నేవల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ బ్యాంక్ సహాయ కార్యదర్శి పెంటకోట గణేష్ మాట్లాడుతూ మదిలో మెదిలే ఆలోచనలు, ఊహకందని ఆలోచనలకు దృశ్య రూపం ఇవ్వడమే చిత్రలేఖనమన్నారు. అనంతరం డ్రాయింగ్ పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతులను ఎంఈవో దివాకర్ చేతుల మీదుగా అందించారు. గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, గ్రంథాలయం మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సభ్యులు మారిశెట్టి శివరామకృష్ణ, బొడ్డేడ జగ్గఅప్పారావు, డ్రాయింగ్ శిక్షకులు ఎం.అనిరుధ్, శరగడం విజయలక్ష్మి, సానా లావణ్య పాల్గొన్నారు.

త్వరితగతిన జగనన్న గృహ నిర్మాణాలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్ : మండలంలో జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణ పనులు వేగవంతం చేయించాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.ధర్మారావు, హౌసింగ్ ఏఈ యుగంధర్ పాల్గొన్నారు.

ఎల్‌ఐసీని నిర్వీర్యం చేసేందుకే ఐపీవో



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న శంకరరావు, సైదునాయుడు, ఏజెంట్లు

అనకాపల్లిటౌన్ : కేంద్రం ఐపీవో పేరిట ఎల్‌ఐసీని ప్రైవేటుపరం చేయాలని చూస్తోందని ఎల్‌ఐసీ యూనియన్ అధ్యక్షుడు గొర్లె శంకరరావు అన్నారు. స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట మంగళవారం 6వ అఖిల భారత మహాసభల గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఎల్‌ఐసీ ఏజెంట్ల భవిష్యత్ ఆందోళనకరంగా మారిందన్నారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఎల్‌ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ మహాసభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను ఇరకాటంలో పెట్టేలా కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఏజెంట్ల వ్యవస్థని, ఎల్‌ఐసీని రక్షించుకోవడానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ అధ్యక్షుడు పెంటకోట సైదునాయుడు, ఏజెంట్లు ఎస్.అప్పారావు, పీలా శ్రీనివాసరావు, రొంగలి వెంకటరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

పరవాడ: రహదారి ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అనకాపల్లి డీఎస్పీ ఎస్.వి.సత్యనారాయణ అన్నారు. లారీ, బస్సు వాహనాల డ్రైవర్లు, యజమానులకు రహదారి ప్రమాదాలపై డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపడం ప్రమాదకరమన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. రహదారి భద్రత నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పరవాడ : స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో గల దేశపాత్రునిపాలెం శివారు జాజులవానిపాలేనికి చెందిన చోడిపల్లి ధర్మలింగేశ్వరరావు (42) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. ఘటనకు సంబంధించి పరవాడ ఎస్ఐ తేజేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.. జాజులవానిపాలెంలో కుటుంబంతో నివసిస్తున్న ధర్మలింగేశ్వరరావు హిందూస్థాన్ షిప్‌యార్డులో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం 6 గంటలకు డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన మృతుడు 7.30 గంటల సమయంలో వాటర్ ట్యాంకులో నీరు నింపడానికి వెళ్లి మోటారు ఆన్ చేస్తున్న క్రమంలో స్విచ్ బోర్డుకు ప్లగ్ పెడుతున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్టీల్‌ప్లాంటు జనరల్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు జరిపి 9.50 గంటలకు ధర్మలింగేశ్వరరావు మృతి చెందినట్లు నిర్ధారించారు.

బీమా సౌకర్యం కల్పించాలని వినతి



జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనకాపల్లి రూరల్ : జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీవిత, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోన లక్ష్మణ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రాన్ని ఇచ్చారు. జీవీఎంసీ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది మరణించినా, అనారోగ్యం బారిన పడినా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో గుంటూరు కార్పొరేషన్ తరహాలో ఇక్కడ కూడా సిబ్బందికి బీమా నిమిత్తం ప్రీమియం సొమ్మును జీవీఎంసీ చెల్లించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాయిబోయిన శేఖర్, జలగడుగుల శివకుమార్, కనకరాజు, శ్యామ్, బి.శ్రీను, చిరంజీవి, రవి కుమార్, సన్యాసిరావు, సతీష్, గంగరాజు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సమావేశం

సబ్బవరం: మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. పనుల్లో జాప్యంపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ముందుగా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో జల జీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. పెద గొల్లల పాలెం సర్పంచి మోపాడ అప్పారావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపు లైన్లు వేసేందుకు 500 మీటర్ల మేర గ్రామంలోని సీసీ రోడ్లు, డ్రైనేజీలను తవ్వేశారని, సరి చేసేందుకు పంచాయతీ నుంచి నిధులు సమకూర్చుకోవాలని ఇరిగేషన్ అధికారులు చెప్పడం భావ్యం కాదన్నారు. అమృతపురంలోనూ పనులు మందకొడిగా సాగుతున్నాయని బైలపూడి రామారావు సభ దృష్టికి తీసుకుని వచ్చారు.

కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీలు దాడి వెంకట ఝాన్సీ లక్ష్మీ రాణి, చొక్కాకుల గోవింద్, ఏవో బాబూరావు, నీటి సరఫరా విభాగం ఏఈ హిమబిందు, నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, కొటాన రాము తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లను వేధించిన ఎంపీని అరెస్టు చేయాలి

పరవాడ: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్, సందీప్‌సింగ్‌లను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం పరవాడలో సంతకాల సేకరణ చేపట్టారు. మల్లయోధులకు భద్రత కల్పించి నిర్దిష్ట సమయంలో విచారణ పూర్తి చేయాలని కోరారు. అధికారులు, పోలీసులపై చర్యలు చేపట్టాలన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలన్నారు. మల్లయోధులకు మద్దతుగా చేపట్టిన నిరసన ప్రదేశంలో విద్యుత్‌ను పునరుద్ధరిస్తూ తాగునీరు, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.లక్ష్మి, ఎం.జానకి, కె.రత్నం, అచ్చియ్యమ్మ, పద్మ, సంతోషి పాల్గొన్నారు.

అవగాహనతోనే డెంగ్యూ నియంత్రణ



డెంగ్యూపై అవగాహన ర్యాలీలో తుమ్మపాల వైద్య, ఆరోగ్య సిబ్బంది



పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు



కశింకోటలో పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది డెంగ్యూపై అవగాహన ర్యాలీ

అనకాపల్లి రూరల్ : డెంగ్యూపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి వాణీ జగదీశ్వరి సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం తుమ్మపాల పీహెచ్‌సీ వద్ద నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాణాంతక డెంగ్యూ వ్యాధిపై ప్రజలందరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలన్నారు. ఏడిస్ ఈజిప్టు దోమ కాటుతో మనిషి నుంచి మనిషికి ఈ వ్యాధి సంక్రమిస్తుందని చెప్పారు. వ్యాధి లక్షణాలను వివరించారు. అంతకుముందు ప్రధాన రహదారిపై ర్యాలీ చేపట్టి డెంగ్యూ నివారణపై అవగాహన వచ్చేలా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డి.శారద ఎంపీహెచ్‌ఈవో జె.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్‌లు బి.సంగం, ఎం.మరియమ్మ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం వద్ద

తుమ్మపాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజారోగ్యానికి సంబంధించి అనేక విప్లవాత్మకమైన చర్యలు చేపట్టిందన్నారు. గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించాలని ఆరోగ్య, పారిశుధ్య సిబ్బందికి సూచించారు. డెంగీకి ప్రధాన కారణమైన దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యనిర్వహణాధికారి కె శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ చదరం చిన్నా, సచివాలయం కార్యదర్శులు ఫణి, సత్యనారాయణ, ఏఎన్ఎంలు జయలక్ష్మి, రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు వై.భాను, శ్రీనివేదిత, ఆర్.ప్రియదర్శిని, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



నెహ్రూచౌక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్సీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేస్తే చాలా వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని అనకాపల్లి జోనల్ కమిషనర్ పి.వెంకటరమణ సూచించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జోనల్ కార్యాలయం నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ దోమలు నీరు నిల్వ ఉండే పూల కుండీలు, నీటి తొట్టెల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలన్నారు. వారం రోజుల పాటు నీరు నిల్వ ఉంటే డెంగ్యూ దోమ గుడ్లుపెట్టి తొమ్మిది రోజుల్లో దోమగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. డెంగ్యూ దోమ కాటుకు గురైన రోగి శరీరంలో రక్తకణాల శాతం తగ్గి, తీవ్ర అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.ఎస్.రవికుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ సీహెచ్ గణేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య, ఆరోగ్య సిబ్బంది జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వై.యశోద మాట్లాడుతూ రోజుల తరబడి నీరు నిల్వ ఉన్నచోట దోమలు గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతాయన్నారు. అవి పెరగకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. నీరు నిల్వ చేసే పాత్రలను ప్రతి వారం ఖాళీ చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమ తెరలు వాడాలని కోరారు. జ్వరం వచ్చినప్పుడు రక్త పరీక్షలు చేసుకుని, చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులంతా ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో భూములు సారవంతం

• ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా అదనపు మేనేజర్ స్వామినాయుడు



జి.భీమవరంలో ప్రకృతి వ్యవసాయం నిర్వహణ రికార్డులను పరిశీలిస్తున్న స్వామినాయుడు



ప్రకృతి సాగు బొప్పాయిని పరిశీలిస్తున్న ప్రాజెక్టు జిల్లా అదనపు మేనేజర్ స్వామినాయుడు

కశింకోట : వర్షాధార భూముల సారవంతానికి చిరు, నవ ధాన్యాలు నాటుకోవాలని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా అదనపు మేనేజర్ ఆర్.స్వామినాయుడు రైతులను సూచించారు. మండలంలోని జి.భీమవరం గ్రామంలో మంగళవారం చిరు, ధాన్యాలు నాటిన భూముల్లో మొలకలు, మొక్కల ఎదుగుదలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన బొప్పాయి తోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాల్లో 30 రకాల చిరు ధాన్యాలు, నవ ధాన్యాలను రైతులు జల్లుకోవాలన్నారు. ఇవి మొలకలు వచ్చి ఎదిగిన 45 రోజులకు కలియదున్నితే భూమి సారవంతమవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ భూముల్లో చిరు ధాన్యాలు నాటేలా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి రోజూ ఆదాయం వచ్చే ఆకుకూరలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేసుకోవడం ద్వారా ఏటీఎం మాదిరిగా రోజూ ఆదాయం పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పొలాలు, గ్రామాలు బాగు పడతాయని, ప్రజలు ఆరోగ్యవంతులుగా జీవిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద కిచెన్ గార్డెన్ వేసుకోవాలన్నారు. దీనివల్ల బజారుకు వెళ్లి కూరగాయలు కొనుక్కోవాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రికార్డులను ఆయన తనిఖీ చేశారు. రైతులకు సరఫరా చేస్తున్న చిరు ధాన్య విత్తన కిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ జి.అనిత, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి ద్వారపురెడ్డి రమణ, ప్రతినిధులు డి.వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.